సాక్షి
రాజన్న సిరిసిల్ల

శుక్రవారం । 12 । మే । 2023



రాజన్న కోడెలు గోశాలకు..

వేములవాడఅర్బన్: రాజన్న గోశాలలోని 40 కోడెలను వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలం రామవరంలోని మహానంది గోశాలకు గురువారం అందించారు.



నిఘా నీడలో పల్లెలు

గ్రామాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉండటంతోపాటు నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు ఎంతోగానో దోహదపడతాయి. 10లో▸

గరిష్టం/కనిష్టం
39.0/26.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం ఎండవేడిమి పెరుగుతుంది. ఉక్కపోత అధికంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

ఘనంగా విగ్రహాల ప్రతిష్ఠాపన



హనుమాన్ విగ్రహం వద్ద నాయకులు

ఎల్లారెడ్డిపేట: మండలంలోని వెంకటాపూర్‌లో నిర్మించిన శ్రీసాయిబాబా ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆలయ సమీపంలో హనుమాన్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఉదయం హోమం, కలషస్థాపన, యంత్రప్రతిష్ఠ, విగ్రహ ప్రతిష్ఠ పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు. వేడుకల్లో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, జెడ్పీటీసీ చీటి లక్ష్మణ్‌రావు, ఎంపీపీ పిల్లి రేణుక, ఎస్సై శేఖర్, సర్పంచ్ అంజమ్మ, ఎంపీటీసీ తిరుపతిబాబు, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే.మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

14వ రోజుకు జేపీఎస్‌ల సమ్మె



నిరసన తెలుపుతున్న జూనియర్ పంచాయతీ కార్యదర్శులు

సిరిసిల్లఅర్బన్: ప్రభుత్వం జూనియర్ పంచాయతీ కార్యదర్శులను రెగ్యులరైజ్ చేయాలని కోరుతూ చేపట్టిన సమ్మె 14వ రోజుకు చేరింది. జేపీఎస్‌ల జిల్లా అధ్యక్షుడు గొల్లపల్లి ప్రవీణ్ మాట్లాడుతూ ప్రభుత్వం జేపీఎస్‌ల సమస్యలు పరిష్కరించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. రెగ్యులరైజ్ చేసే వరకూ సమ్మె కొనసాగుతుందని హెచ్చరించారు. కొందరు ఐక్యతను దెబ్బతీసేలా ప్రయత్నిస్తున్నారని, వారిని తిప్పికొడుతామన్నారు. సంఘం జిల్లా అధ్యక్షుడు రాజేశ్వరరావు జేపీఎస్‌ల ప్రయోజనాలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నందున ఆయనను బహిష్కరిస్తున్నట్లు జూనియర్ పంచాయతీ కార్యదర్శులు తెలిపారు.

అధికారులతో కలెక్టర్ సమీక్ష

సిరిసిల్లఅర్బన్: మినీ స్టేడియాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకునేలా చూడాలని కలెక్టర్ అనురాగ్ జయంతి మున్సిపల్, విద్యా, క్రీడా శాఖ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో ఎస్పీ అఖిల్ మహాజన్‌తో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. మంత్రి కేటీఆర్ చొరవతో సిరిసిల్లలో అధునాతన సౌకర్యాలతో మినీస్టేడియం నిర్మించామని, దీనిని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలో చదివే విద్యార్థులు సద్వినియోగం చేసుకునేలా అధికారులు చూడాలన్నారు. స్కేటింగ్ కోసం అనువైన స్థలాన్ని చూడాలని మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. విద్యార్థి దశ నుంచే క్రీడలవైపు దృష్టి సారించేలా విద్యార్థులను చైతన్యపరచాలన్నారు. సమావేశంలో జిల్లా క్రీడల అభివృద్ధి శాఖ అధికారి ఉపేందర్, మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య, డీఈవో రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం కప్ క్రీడా పోటీలకు ఏర్పాట్లు చేయాలి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

సిరిసిల్లఅర్బన్: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టే సీఎం కప్–2023 క్రీడా పోటీలకు ఏర్పాట్లు చేయాలని అదనపు కలెక్టర్ సత్యప్రసాద్ అధికారులను ఆదేశించారు. గురువారం సాయంత్రం కలెక్టరేట్ నుంచి పోటీల నిర్వహణపై ఎంపీడీవోలు, ఏపీవోలతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. ఈనెల 15నుండి 17వరకు స్త్రీ, పురుషులకు వేర్వేరుగా మండలస్థాయి పుట్‌బాల్, ఖోఖో, కబడ్డీ పోటీలు నిర్వహించాలని, గెలుపొందిన వారిని జిల్లాస్థాయి పోటీలకు పంపించాలని సూచించారు. 15నుంచి 36 ఏళ్ల వారు అర్హులుగా పేర్కొన్నారు. మండలస్థాయిలో ఎంపీడీవో, తహసీల్దార్, ఎంఈవో, ఎంపీవో, మెడికల్ ఆఫీసర్, పీడీ, పీఈటీలు, ఎస్‌హెచ్‌వోలు, మున్సిపల్ కమిషనర్‌తో కూడిన కమిటీ ఏర్పాటు చేయాలన్నారు. ఈనెల 22 నుంచి 24వరకు జిల్లాస్థాయి పోటీలు నిర్వహించాలన్నారు. విజేతలకు బహుమతులు, పాల్గొన్నవారికి సర్టిఫికెట్లు అందించాలన్నారు. పోటీల నిర్వాహణకు మండలానికి రూ.15వేల చొప్పున నిధులు కేటాయించిందన్నారు. కాన్ఫరెన్స్‌లో జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి ఉపేందర్‌రావు, జెడ్పీ సీఈవో గౌతమ్‌రెడ్డి, డీపీవో రవీందర్ పాల్గొన్నారు.



ఇది సిరిసిల్లలోని ఓ బడా వస్త్రోత్పత్తిదారుడి సాంచాల కార్ఖానా. ఇక్కడ 60 సాంచాలున్నాయి. పది మంది కార్మికులు పనిచేస్తారు. పెద్ద సేటు పేరిట నాలుగు కరెంట్ మీటర్లు, ఆయన భార్య పేరిట మరో నాలుగు, కొడుకు పేరిట ఇంకో నాలుగు కరెంట్ మీటర్లు ఉన్నాయి. మొత్తంగా 12 మీటర్లతో కార్ఖానా నడిపిస్తున్నాడు. కుటీర పరిశ్రమగా దీన్ని గుర్తించి ప్రతి యూనిట్ కరెంట్‌ను రూ.4కు సరఫరా చేస్తుండగా.. ఇందులో రూ.2 ప్రభుత్వం భరిస్తోంది. మరో రూ.2 వస్త్రోత్పత్తిదారులు 'సెస్'కు చెల్లిస్తున్నారు. ఇది రెండున్నర దశాబ్దాలుగా అమలవుతోంది. సిరిసిల్లలో ఇలా యాభై నుంచి వందల సంఖ్యలో సాంచాలున్న పెద్ద సేట్లు కూడా విద్యుత్ సబ్సిడీని పొందుతున్నారు.



సాంచాల మధ్య ఉన్న ఈయన పేరు సిరిసిల్ల యాదగిరి. పట్టణంలోని గణేశ్ నగర్‌కు చెందిన యాదగిరి తన ఇంట్లో 12 సాంచాలను కిరాయికి (అద్దె) తెచ్చుకుని బతుకమ్మ చీరలను ఉత్పత్తి చేస్తున్నాడు. తనతోపాటు మరో కార్మికుడికి పని కల్పిస్తున్నాడు. యాదగిరి మధ్య తరగతి ఆసామి. ఇతను సాంచాలను అద్దెకు తెచ్చుకుని.. భీములను వార్పిన్ ఉన్న పెద్ద సేట్ల దగ్గర తెచ్చుకుని పని చేసుకుంటున్నాడు. ఇతనికి కూడా కరెంట్ బిల్లులో 50 శాతం రాయితీ వర్తిస్తోంది. ఆర్థికంగా లేని యాదగిరి.. ఆర్థికంగా ఉన్న పెద్ద సేట్లకు కూడా ఒకే విధమైన 50 శాతం కరెంట్ సబ్సిడీ వర్తిస్తోంది.

సేట్లకు బిల్లుల షాక్..!

- విద్యుత్ సబ్సిడీ ఎత్తివేత..
- 127 ఎస్ఎస్ఐ యూనిట్లకు మొత్తం బిల్లు
- కోర్టు ఆదేశాలతో రాయితీ రద్దు చేసిన 'సెస్'
- 2016 నుంచి విద్యుత్ సబ్సిడీ సొమ్ము వసూలు
- ఆర్థికంగా ఉన్నోళ్లకు సబ్సిడీపై కోర్టు ఆగ్రహం
- ప్రతి నెలా రూ.1.50 కోట్ల అదనపు చెల్లింపులు



'సెస్' కార్యాలయం

సిరిసిల్ల: సిరిసిల్ల వస్త్ర పరిశ్రమలో ఆత్మహత్యలు, ఆకలి చావులు నెలకొన్న నేపథ్యంలో రెండున్నర దశాబ్దాల కిందట ప్రభుత్వం నేతన్నలను ఆదుకునేందుకు వస్త్ర పరిశ్రమను కుటీర పరిశ్రమగా గుర్తించి 'సెస్' పరిధిలో కేటగిరి–4గా విద్యుత్‌ను 50 శాతం సబ్సిడీ ప్రకటించింది. వస్త్రోత్పత్తిదారులు వినియోగించుకున్న కరెంట్ బిల్లులో సగం డబ్బులను ప్రభుత్వం భరిస్తోంది. ఇందులో 10 హెచ్‌పీల వరకు సబ్సిడీ ఉండేలా నిబంధన విధించింది. దీంతో బినామీ పేర్లతో మీటర్లు పొంది.. ఎక్కువ సాంచాలపై వస్త్రాన్ని ఉత్పత్తి చేస్తూ.. కేటగిరి–4లో విద్యుత్ సబ్సిడీని మధ్య తరగతి ఆసాములు, మరోవైపు పెద్దపెద్ద సేట్లు పొందుతున్నారు. ఫలితంగా సిరిసిల్లలో ఐదు సాంచాలు ఉన్న పేదోళ్లకు.. వందల సాంచాలున్న పెద్దోళ్లకు ఇద్దరికీ విద్యుత్ రాయితీ ఒకేలా అందుతుండడంతో ఆర్థిక అసమానతలు కొనసాగుతున్నాయి. మరోవైపు రూ.46 కోట్ల విద్యుత్ రాయితీ బకాయిలను ప్రభుత్వం 'సెస్' ఇంకా చెల్లించాల్సి ఉంది.

ఇప్పుడేం జరిగింది..?!

2016లో ప్రభుత్వం బతుకమ్మ చీరల ఆర్డర్లను సిరిసిల్ల వస్త్రపరిశ్రమకు అందించింది. ఐదు, పది సాంచాలున్న మధ్యతరగతి వస్త్రోత్పత్తిదారులు మ్యాక్స్ సంఘాలుగా ఏర్పడి చీరల ఆర్డర్లు పొందారు. వందలాది సాంచాలున్న పెద్ద సేట్లు చిన్న తరహా పరిశ్రమలు (ఎస్ఎస్ఐ)గా రిజిస్ట్రేషన్ చేయించుకుని బతుకమ్మ చీరల ఆర్డర్లను పొందారు. 127 మంది పెద్దసేట్లు ఎస్ఎస్ఐ యూనిట్లుగా నమోదు అయ్యారు. సిరిసిల్లకు చెందిన చిమ్మని ప్రకాశ్ అనే ఆసామి పెద్దోళ్లకు.. పేదోళ్లకు ఒకేవిధంగా విద్యుత్ సబ్సిడీ ఇవ్వడం ఏమిటీ..? 10 హెచ్‌పీల వరకే సబ్సిడీ ఉండాలి.. అనే నిబంధనలు అమలు కావడం లేదని కోర్టును ఆశ్రయించాడు. దీనిపై విచారణ జరిపిన కోర్టు ఎస్ఎస్ఐ యూనిట్ల విద్యుత్ మీటర్లను కేటగిరి–3గా మార్చి కమర్షియల్ విద్యుత్ బిల్లులు వసూలు చేయాలని, 50 శాతం విద్యుత్ సబ్సిడీని రద్దు చేయాలని ఆదేశించింది. 2016 నుంచి పెద్ద సేట్లు పొందిన విద్యుత్ రాయతీ సొమ్మును కూడా వారి నుంచి రికవరీ చేయాలని కోర్టు స్పష్టం చేసింది. పెద్ద సేట్లు స్వయంగా పరిశ్రమగా పేర్కొంటూ అధికారికంగా రిజిస్ట్రేషన్ చేయించుకోవడంతో కుటీర పరిశ్రమ కాస్త వాణిజ్య పరిశ్రమగా మారడంతో విద్యుత్ సబ్సిడీ రద్దు అయింది.

మొత్తం మీటర్ల యూనిట్లను కలిపి బిల్లు

కేటగిరి–4లో.. ప్రతి యూనిట్ విద్యుత్‌కు రూ.4 ఉంది. కేటగిరి–3లో ప్రతి యూనిట్ విద్యుత్‌కు రూ.7.70గా ఉంది. సాంచాల కార్ఖానాలో ఎన్ని మీటర్లు ఉంటే అన్ని మీటర్ల విద్యుత్ రీడింగ్‌ను జమ చేసి ప్రతి యూనిట్‌కు రూ.7.70 చొప్పున విద్యుత్ బిల్లులను విధిస్తున్నారు. ఇలా ఒక్కనెల విద్యుత్ బిల్లులే రూ.6 లక్షల నుంచి రూ.26 లక్షల వరకు మీటర్ల సంఖ్యను బట్టి బిల్లింగ్ అవుతోంది. ఈ లెక్కన ప్రతినెలా రూ.కోటి నుంచి రూ.1.50 కోట్ల అదనపు విద్యుత్ బిల్లులు వసూలు కానున్నాయి. సిరిసిల్లలో 127 ఎస్ఎస్ఐ యూనిట్ల పరిధిలో దాదాపు 6500 సాంచాలు ఉన్నాయి. భారీ ఎత్తున విద్యుత్ బిల్లులు రావడంతో పెద్ద సేట్లు ఏం చేయాలనే సందిగ్ధంలో ఉన్నారు.

కోర్టు ఆదేశాల మేరకే..



కోర్టు ఆదేశాల మేరకు 127 ఎస్ఎస్ఐ యూనిట్లను కేటగిరి–3లోకి మార్చాం. ఈనెల నుంచే విద్యుత్ సబ్సిడీ లేకుండా బిల్లులు వసూలు చేస్తున్నాం. కోర్టు ఆదేశాలను పక్కాగా అమలు చేస్తాం. 2016 నుంచి పొందిన విద్యుత్ సబ్సిడీ వసూలుకు కోర్టు మూడు నెలల గడువు ఇచ్చింది.

– ఎస్.రామకృష్ణ, 'సెస్' ఎండీ

తరుగు పేరిట దోపిడీ

- ముందుగా కొనుగోలు కేంద్రాల్లో.. తరువాత మిల్లుల్లో చేతివాటం
- తేమ, గడ్డి, మట్టిపెడ్డల పేరుతో రెండు కిలోలు తరుగు
- అదే కారణంతో మిల్లుల్లో మరోసారి ధాన్యం కోత
- క్వింటాల్‌కు తొమ్మిది కిలోలకుపైగానే..
- కొనుగోలు కేంద్రం నిర్వాహకులు, మిల్లర్లు కుమ్మక్కు..?



కరీంనగర్ రూరల్ మండలం దుర్శేడ్‌లో ధాన్యం కొనుగోళ్లు

జిల్లా	సాగు (ఎకరాల్లో)	దిగుబడి అంచనా (మె.టన్నుల్లో)
కరీంనగర్	2,71,388	7.5 లక్షలు
పెద్దపల్లి	2,00,033	4 లక్షలు
జగిత్యాల	2,97,638	7 లక్షలు
సిరిసిల్ల	1,71,008	3 లక్షలు

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: వడగండ్ల గండాలు దాటి మిగిలిన పంటను కొనుగోలు కేంద్రానికి తీసుకువచ్చిన రైతులు రకరకాలుగా దోపిడీకి గురవుతున్నారు. కోతల పేరుతో మిల్లర్లంతా ఏటా రూ.వందల కోట్ల దందా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా చేస్తున్న విషయం తెలిసిందే. మొన్నటి దాకా అకాల వర్షాలు, వడగండ్లతో చాలావరకు పంటనష్టం జరిగింది. చివరికి చేతికి వచ్చిన పంటను కొనుగోలు కేంద్రాలకు తీసుకువస్తే.. తేమ, గడ్డి, తాలు ఉందంటూ రకరకాల కారణాలు చెప్పి రెండు కిలోల మేర తరుగు తీస్తున్నారు. వాస్తవానికి 40.600 కిలోల బస్తా కోసం 650 గ్రాముల (సంచి బరువు)కు మించి తరుగు తీయవద్దన్న నిబంధనను ఉమ్మడి జిల్లాలో ఎవరూ పెద్దగా పట్టించుకోవడం లేదు. కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు–మిల్లర్లు కలిసే ఈ దందా చేస్తున్నారని అన్నదాతలు మండిపడుతున్నారు.

క్వింటాలుకు ఎనిమిది కిలోలు..!

ప్రస్తుతం కొనుగోలు కేంద్రాల్లో తేమ సాకుతో చాలామంది మిల్లర్లు కొర్రీలు పెడుతున్నారు. అకాల వర్షాలు, వడగండ్ల కారణంగా చాలా చోట్ల కొనుగోలు కేంద్రాల్లో ఆరబోసిన ధాన్యం కుప్పలు తడిసిన విషయం తెలిసిందే. గత వంద ఏళ్లలో ఎన్నడూ చూడని విపత్తును ఇటీవల రైతులు ఎదుర్కొన్నారు. కల్లాల్లోని ధాన్యం ఇంకా ఆరనేలేదు. 20శాతం వరకు తేమ ఉన్నా కొంటామని ప్రభుత్వం చెప్పినా.. క్షేత్రస్థాయిలో ఈ నిబంధన ఉల్లంఘనకు గురవుతోంది. తేమతోపాటు వరిధాన్యంలో మట్టిబెడ్డలు, గడ్డి, తాలూ ఉన్నాయంటూ సాకులు చెబుతూ.. కొనుగోలు కేంద్రంలో బస్తాకు రెండు కిలోలు తరుగు తీస్తున్నారు. అనంతరం మిల్లుకు వెళ్లిన ధాన్యం తూకం ఎంట్రీ చేసే సమయంలో మరో రెండు కిలోల చొప్పున కోత పెడుతున్నారు. మొత్తంగా క్వింటాలుకు రెండు నుంచి తొమ్మిది కిలోల చొప్పున ధాన్యం తరుగు తీస్తున్నారు. ఇదేం అన్యాయమని నిలదీసిన రైతుల ధాన్యం కొనమని తెగేసి చెబుతున్నారు.

పెద్దపల్లిలో ప్రారంభం కాని కొనుగోళ్లు..

సిరిసిల్ల, జగిత్యాల, కరీంనగర్‌లో తరుగు మోసాలు నడుస్తుంటే పెద్దపల్లిలో మాత్రం కథ మరోలా ఉంది. జిల్లాలో ప్రభుత్వం 300 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి, వాటి ద్వారా సుమారు 4 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాలని నిర్ణయించింది. కానీ.. క్షేత్రస్థాయిలో కొనుగోళ్లు నత్తనడకన కొనసాగుతున్నాయి. ఇప్పటివరకు కేవలం 62,245 మెట్రిక్ టన్నుల ధాన్యం మాత్రమే కొనుగోలు చేశారు. క్వింటాకు 6 నుంచి 7 కిలోల తరుగుకు ఒప్పుకుంటేనే కొనుగోలు చేస్తున్నారని అన్నదాతలు వాపోతున్నారు. తరుగు లేకుండా మిల్లర్స్‌కు తరలించిన ధాన్యాన్ని మిల్లర్లు దించుకోవడం లేదు.

నెలరోజులుగా కేంద్రాల్లోనే..



మాకు ఉన్న పొలం తోపాటు 8 ఎకరాలు కౌలుకు తీసుకొని వరి సాగు చేశాం. చేతికొచ్చిన పంటను నెలరోజుల క్రితం సెంటర్‌కు తీసుకొచ్చి ఆరబోసినం. వర్షాలు పడుతుండటంతో సద్ది తెచ్చుకొని ఇక్కడే తింటూ ధాన్యం తడవకుండా కాపాలకాస్తున్నాం. తేమ, తాలు పేరుతో తరుగు పెడుతున్నారు. వచ్చినకాడికి అమ్ముకుందామన్నా మిల్లర్లు ధాన్యం దించుకోవటం లేదని కాంటాలు పెట్టడం లేదు.

– బాలసాని రాజమణి, సుద్దాల

రెండున్నర కిలోలు అధికం



నాకు నాలుగెకరాల వ్యవసాయ పొలం ఉంది. ఆ భూమిలో దాదాపు 58 క్వింటాళ్ల వడ్లు అయ్యాయి. వాస్తవానికి ప్రతీసారి 120 క్వింటాళ్ల దిగుబడి వచ్చేది. కానీ.. ఈసారి వడగళ్ల, అకాల వర్షాల కారణంగా దిగుబడి పడిపోయింది. తేమ 17శాతం ఉంటేనే కొంటున్నారు. మా వద్ద బస్తాను 40 కిలోలకు రెండున్నర కిలోలు అదనంగా తూకం వేస్తున్నారు.

– మాదుగుల లింబాద్రి, సిరిసిల్ల

కోతలు పెడితే మాకు మిగిలేదేంటి..?



రెండున్నర ఎకరాల్లో వరి వేస్తే వచ్చిన దిగుబడే తక్కువ. 70 క్వింటాళ్ల ధాన్యం వస్తదనుకుంటే మాయదారి వానతో సగం కూడా రాలేదు. ఇప్పుడు అమ్మితే బస్తాకు 2 కిలోలు కోత పెడుతున్నారు. ఇదెక్కడి న్యాయం. ఈసారి వానల తోటి నష్టపోయినం. ఇప్పుడు కొనుగోలు కేంద్రాలల్ల నష్టపోతున్నం.

– లక్ష్మి, గంగాధర

సర్కారు బడుల్లో సదుపాయాలు కల్పించాలి

- ఈ నెలాఖరులోపు 'మన ఊరు– మన బడి' పూర్తి చేయాలి
- రహీంఖాన్‌పేటలో కంటివెలుగు కార్యక్రమం పరిశీలన
- ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి



వైకుంఠధామాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

ఇల్లంతకుంట(మానకొండూర్): విద్యాసంవత్సరం ప్రారంభంలోగా జిల్లాలోని 172 ప్రభుత్వ పాఠశాలల్లో సకల సదుపాయాలు కల్పించాలని, మన ఊరు – మన బడి కార్యక్రమం కింద తొలివిడతగా జిల్లాలో చేపట్టిన పనులన్నీ ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలని కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు. మండలంలోని వల్లంపట్ల, ఇల్లంతకుంట గ్రామాల్లోని జిల్లాపరిషత్ పాఠశాలల్లో మన ఊరు మన బడి కింద చేపట్టిన పనుల పురోగతిని పరిశీలించారు. మండల కేంద్రంలోని జెడ్పీ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న సహస్ర హెల్పింగ్ హ్యాండ్స్ ఫర్ ఓల్డ్ ఏజ్ పర్సన్స్ యంత్రాన్ని రూపకల్పన చేసినందుకు కలెక్టర్ అభినందించారు.

2.5లక్షల మందికి కంటి పరీక్షలు...

జిల్లాలో ఇప్పటి వరకు 2.5లక్షల మందికి కంటి పరీక్షలు నిర్వహించినట్లు కలెక్టర్ తెలిపారు. రహీంఖాన్‌పేటలో కంటివెలుగు సందర్శించారు. ప్రజలు కంటివెలుగును వినియోగించుకోవాలని సూచించారు. వల్లంపట్లలో కంపోస్ట్ షెడ్, వైకుంఠధామాలను సందర్శించారు. కంపోస్ట్‌షెడ్, వైకుంఠధామాలు బాగున్నాయని సర్పంచ్‌ను అభినందించారు.

ధాన్యం కొనుగోళ్లలో ఇబ్బంది తలెత్తనీయొద్దు

ధాన్యం కొనుగోళ్లలో ఇబ్బందులు తలెత్తకూడదని, అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. తూకం వేసిన ధాన్యం ఎక్కడా నిల్వ ఉండొద్దని, మిల్లులకు తరలించేలా ఏర్పాట్లు చేయాలని తహసీల్దార్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో డీఈఓ రమేశ్‌కుమార్, ఉపవైద్యాధికారి శ్రీరాములు, అదనపు డీఆర్డీఓ మదన్‌మోహన్, తహసీల్దారు నరేందర్, ఎంపీడీఓ మీర్జా, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ప్రజలందరికీ ఉచిత వైద్యం



బస్తీ దవాఖానాను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రమేశ్‌బాబు, డీఎంహెచ్‌వో సుమన్‌మోహన్‌రావు

- అందుకే బస్తీ దవాఖానాలు ప్రారంభం
- వేములవాడ ఎమ్మెల్యే రమేశ్‌బాబు

వేములవాడ: రాష్ట్రంలోని ప్రజలందరికీ ఉచితంగా వైద్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే రమేశ్‌బాబు అన్నారు. పట్టణంలోని జాత్రాగ్రౌండ్‌లో రూ.13 లక్షలతో ఏర్పాటు చేసిన బస్తీ దవాఖానాను మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి, కమిషనర్ అన్వేశ్, జిల్లా వైద్యాధికారి సుమన్ మోహన్‌రావుతో కలిసి గురువారం ప్రారంభించారు. వేములవాడకు ప్రత్యేకంగా వంద పడకల ఆసుపత్రి తెచ్చామన్నారు. రాజన్న దర్శనానికి వచ్చే భక్తులకు అనువుగా ఉండేలా జాత్రాగ్రౌండ్‌లో బస్తీ దవాఖానా ప్రారంభించామన్నారు. నియోజకవర్గంలో 30 పీహెచ్‌సీలకు రూ.6 కోట్లు మంజూరు చేసిన మంత్రి హరీశ్‌రావుకు కృతజ్ఞతలు తెలిపారు. ఎన్ఆర్ఐ జువ్వాడి శ్రీనివాస్‌రావు, వైద్యులు రవీందర్, దివ్యశ్రీ, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

మొదటిదశలో 100 దళితబంధు యూనిట్లు

నియోజకవర్గంలో మొదటిదశలోనే 100 దళితబంధు యూనిట్లు అందించామని ఎమ్మెల్యే తెలిపారు. శాత్రాజుపల్లికి చెందిన నవీన్‌కు దళితబంధు ద్వారా మంజూరైన సెంట్రింగ్ షాపును ప్రారంభించారు. రెండోదశలో 110 యూనిట్లు మంజూరయ్యాయన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ మాధవి, కౌన్సిలర్లు జయ, నరాల శేఖర్, యాచమనేని శ్రీనివాస్‌రావు, సిరిగిరి చందు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

కంటి వెలుగులో 4,276 మందికి పరీక్షలు

సిరిసిల్లఅర్బన్: జిల్లాలో కంటివెలుగులో భాగంగా గురువారం 4,276 మందికి పరీక్షలు చేశారు. వీరిలో 674 మందికి రీడింగ్ గ్లాస్‌లు, 455 మందికి పాయింట్ అద్దాలు అందించారు. జిల్లాలో 26 ప్రాంతాల్లో నిర్వహించిన కంటి వెలుగులో 234 మంది సిబ్బంది పాల్గొన్నట్లు డీఎంహెచ్‌వో సుమన్‌మోహన్‌రావు తెలిపారు.

వృత్తికళాకారులూ శాస్త్రవేత్తలే..

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ప్రాచీన కాలం నుంచి కమ్మరి, కుమ్మరి, వడ్రంగి, మేదరి, అవుసుల వంటి వృత్తికారులు కూడా శాస్త్రవేత్తలే అని తెలంగాణ వివేక రచయితల వ్యవస్థాపక అధ్యక్షుడు వాసరవేణి పర్శరాములు అన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా పాలెంలో గురువారం తెలుగు సాహిత్యంలో ×ఉత్పత్తి వృత్తులు–అధ్యయనం ₹పై నిర్వహించిన జాతీయ సదస్సులో పర్శరాములు ప్రసంగించారు. ఆధునికశాస్త్ర విజ్ఞానానికి మూలం కుమ్మరిచక్రం అని, రసాయన శాస్త్రానికి మూలం బంకమట్టి అని అన్నారు. కుమ్మరులలో అత్యధికులు పేదరికంలో మగ్గుతున్నారని.. వీరి అభివృద్ధికి ప్రభుత్వం రూ.వెయ్యి కోట్లు కేటాయించాలని కోరారు.

భిక్షాటన చేసి.. రోడ్డుపై మొరం పోయించి..



భిక్షాటన చేస్తున్న కాంగ్రెస్ నాయకులు



మొరం పోయిస్తున్న నాయకులు

చందుర్తి(వేములవాడ): వేములవాడ ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్‌బాబు వైఖరిని నిరసిస్తూ రుద్రంగి మండలకేంద్రంలో డివైడర్లకు ఇరువైపులా ఏర్పడిన గుంతలు పూడ్చేందుకు కాంగ్రెస్ నాయకులు గురువారం భిక్షాటన చేశారు. దుకాణాదారుల వద్దకు వెళ్లి రోడ్డు మరమ్మతుకు డబ్బులు పోగు చేశారు. జమ చేసిన డబ్బులతో రోడ్డుపై మొరం పోయించి గుంతలు పూడ్చారు. కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి చెలుకల తిరుపతి మాట్లాడుతూ రుద్రంగిలో డివైడర్లను నిర్మించి, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయించి మూడేళ్లు గడుస్తోందని, ఇప్పటివరకు సైడ్‌బర్మ్స్‌ చేపట్టకపోవడంతో గుంతలు ఏర్పడి వాహనాల రాకపోకలు ఇబ్బందిగా మారిందన్నారు. చినుకు పడితే చిన్నపాటి కుంటలా మారి ద్విచక్రవాహనాదారులు, కార్లు, ఆటోలు నడవడం లేదన్నారు. పాలకులపై నమ్మకం లేకనే భిక్షాటన చేసి మరమ్మతు చేయించామన్నారు. కార్యక్రమంలో పార్టీ గ్రామ అధ్యక్షుడు సామ మోహన్‌రెడ్డి, మండల ఉపాధ్యక్షుడు తర్రె మనోహర్, గడ్డం శ్రీనివాస్‌రెడ్డి, తర్రె లింగం, కట్కూరి దాసు, పరంధాములు, మాడిశెట్టి అభిలాష్, మనోజ్, పల్లి గంగాధర్, గండి నారాయణ, యాదగిరి, మధు తదితరులు ఉన్నారు.

మూతబడిన పరిశ్రమలు తెరిపించాలి



వినతిపత్రం ఇస్తున్న కోడం రమణ

తంగళ్లపల్లి(సిరిసిల్ల): మండలంలోని బద్దెనపల్లి, సారంపల్లి టెక్స్‌టైల్ పార్కులో మూతబడిన పరిశ్రమలను తెరిపించి కార్మికులకు ఉపాధి కల్పించాలని, వసతులు అందుబాటులోకి తేవాలని పవర్‌లూం వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కోడం రమణ డిమాండ్ చేశారు. ఈ మేరకు టెక్స్‌టైల్ పార్కు ఏడీకి గురువారం వినతిపత్రం అందించారు. సిరిసిల్లలో ఆకలిచావులు నివారించేందుకు టెక్స్‌టైల్ పార్కు ఏర్పాటు చేశారని, 111 యూనిట్లతో ప్రారంభమైన పార్కులో ప్రస్తుతం 30 యూనిట్లు మాత్రమే పనిచేస్తున్నాయని తెలిపారు. 1500 మందికి ఉపాధి కల్పించిన పరిశ్రమ ప్రస్తుతం 500మందికి పడిపోయిందన్నారు. పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్‌కు విన్నవించినా ఫలితం లేకుండాపోతోందన్నారు. 2020 సంవత్సరానికి సంబంధించిన బతుకమ్మ చీరల యారన్ 10శాతం సబ్సిడీని కార్మికులకు అందించాలని కోరారు. టెక్స్‌టైల్ పార్కు పవర్‌లూం యూనియన్ అధ్యక్షుడు కూచన శంకర్, పవర్‌లూమ్ కార్మిక నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కానిస్టేబుల్‌కు అవార్డు


కానిస్టేబుల్ సతీశ్‌ను సన్మానిస్తున్న తోటి సిబ్బంది

ఎల్లారెడ్డిపేట (సిరిసిల్ల): మండలకేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న సతీశ్‌ను ఉత్తమ పోలీస్‌గా గుర్తిస్తూ అంత్రిక్ సురక్ష మోడల్ అవార్డు అందజేశారు. హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో హోం మంత్రి మహమూద్ అలీ చేతులమీదుగా సతీశ్ బుధవారం అవార్డు అందుకున్నారు. మావోయిస్టు ప్రభావిత ప్రాంతమైన కాటారంలో సమర్థవంతంగా విధులు నిర్వర్తించడాన్ని గుర్తిస్తూ ప్రభుత్వం సతీశ్‌ను ఈ అవార్డుకు ఎంపిక చేసింది. అవార్డు అందుకున్న సతీశ్‌ను ఎస్సై శేఖర్, సిబ్బంది, ప్రజాప్రతినిధులు గురువారం సన్మానించారు. వైస్ ఎంపీపీ కదిరె భాస్కర్‌గౌడ్, నాయకులు శ్రీనివాస్, లక్ష్మారెడ్డి, గణేశ్ పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి


ఎల్లయ్య మృతదేహం

బోయినపల్లి (చొప్పదండి): విద్యుత్‌దాఘాతంతో రైతు మృతిచెందిన ఘటన మండలంలోని జగ్గారావుపల్లిలో గురువారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కల్లూరి పెద్ద ఎల్లయ్య (58) ఇటీవల వరద కాల్వ లింక్ కెనాల్ పరిసరాల్లో తన వరి పొలం కోశాడు. కాగా ఇటీవల చేను వద్ద విద్యుత్ వైర్లను ఎవరో ఎత్తుకెళ్లారు. ఈ క్రమంలో స్టార్టర్ ఫీజులు తీసే క్రమంలో విద్యుత్ షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య సత్తెవ్వ ఉంది. ఘటనా స్థలాన్ని ఎస్సై మామిడి మహేందర్ సందర్శించారు.

భూ వివాదంలో నలుగురిపై కేసు

ఎల్లారెడ్డిపేట (సిరిసిల్ల): మండలంలోని గొల్లపల్లికి చెందిన పెద్దూరి అజయ్‌కి చెందిన భూమిలోకి అక్రమంగా ప్రవేశించి బెదిరించిన సంఘటనలో నలుగురిపై పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. ఎస్సై శేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. అజయ్‌కి గ్రామంలోని సర్వేనంబర్ 402లో 225 గజాల భూమి ఉంది. ఈ భూమి తమదంటూ అదే గ్రామానికి చెందిన అందె పోచయ్య కొంత కాలంగా అజయ్‌తో ఘర్షణ పడుతున్నాడు. దీంతో అజయ్ కోర్టును ఆశ్రయించగా భూమి తనకు చెందినదిగా తీర్పు రావడంతో ఇంటి నిర్మాణం చేపట్టగా, అందులోకి అందెపోచయ్య, అతని భార్య పోచవ్వ, కుమారులు కృష్ణ, ఈశ్వర్ ప్రవేశించి అజయ్‌ని బెదిరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు నలుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

సింగారంలో మరో నలుగురిపై..

ఎల్లారెడ్డిపేట: మండలంలోని సింగారం గ్రామానికి చెందిన నాగపురి నాగభూషణం అనే వ్యక్తిని బెదిరించిన సంఘటనలో అదే గ్రామానికి చెందిన నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై శేఖర్ తెలిపారు. నాగభూషణం భూమిలోకి అదే గ్రామానికి చెందిన యాద నారాయణ, యాద భారతి, యాద విక్రం, యాద శ్రీనివాస్ అక్రమంగా ప్రవేశించి, ఆ భూమి తమదంటూ చంపుతామని బెదిరించడంతో బాధితుడు పోలీసులను ఆశ్రయించాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

నిఘా నీడలో పల్లెలు

- సీసీ కెమెరాల ఏర్పాటుకు ముందుకొస్తున్న దాతలు
- ఇప్పటికే పలు గ్రామాల్లో ఏర్పాటు
- అభినందిస్తున్న పోలీసులు


గ్రామంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు


మర్రిపల్లిలో సీసీ ఫుటేజీని పరిశీలిస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్

వేములవాడ రూరల్ : గ్రామాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉండటంతో పాటు నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు ఎంతోగానో దోహదపడతాయి. పోలీసులు తీసుకుంటున్న ప్రత్యేక చొరవతో ప్రజాప్రతినిధులు ముందుకొస్తున్నారు. ఇందుకు దాతల సహకారంతో గ్రామాల్లో ప్రత్యేకంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నారు. సీసీ కెమెరాల ఏర్పాటుకు గ్రామస్తులతో పాటు ఇతర వ్యాపారవేత్తలు సహకారం అందిస్తున్నారు. గ్రామాల్లో ప్రజాప్రతినిధులు సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం పట్ల జిల్లా పోలీస్ శాఖ వారిని ప్రత్యేకంగా అభినందిస్తున్నారు. మండలంలోని మర్రిపల్లిలో కొంతమంది రైస్‌మిల్ వ్యాపారులు, గ్రామస్తుల సహకారంతో సర్పంచ్ కట్కం మల్లేశం, 20 సీసీ కెమెరాలను వాడవాడనా ఏర్పాటు చేశారు. ఇటీవల వాటిని ప్రారంభించిన ఎస్పీ అఖిల్ మహాజన్ వారిని ప్రత్యేకంగా అభినందించారు. కొత్త వ్యక్తులు గ్రామానికి వచ్చినా, దొంగతనాలు జరిగినా సీసీ కెమెరాలతో గుర్తించవచ్చని గ్రామస్తులకు సూచించారు. ఇప్పటికే మండలంలో 17 గ్రామాలుండగా దాదాపు వట్టెంల, నూకలమర్రి, చెక్కపల్లి, హన్మాజీపేట, మల్లారం, లింగంపల్లి తదితర గ్రామాల్లో ఏర్పాటు చేశారు. 17 గ్రామాలకు గాను 10 గ్రామాల్లో ఇప్పటివరకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. మిగిలిన గ్రామాల్లో ఏర్పాటు చేయాలని సర్పంచ్‌లకు పోలీస్ శాఖ సూచించింది.

దాతల సహకారంతో..

పల్లెల్లో ఉండి పట్టణాల్లో స్థిరపడిన కొంతమంది గ్రామాల్లో సీసీ కెమెరాలను అందజేస్తున్నారు. నూకలమర్రి గ్రామానికి చెందిన దామోదర్‌రావు 10 సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకారం అందించినట్లు సర్పంచ్ పెంద్యాల తిరుపతి తెలిపారు. వట్టెంల, మర్రిపల్లి గ్రామాల్లో రైస్‌మిల్లుల కెమెరాల ఏర్పాటుకు సహకారం అందిస్తున్నారు. మరికొందరు తోడ్పాటునందించాలి.

అన్ని గ్రామాల్లో ఏర్పాటు చేస్తాం



మండలంలోని అన్ని గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తాం. ఇప్పటికే కొన్ని గ్రామాల్లో ఏర్పాటు చేశాం. ప్రతిఒక్కరూ సీసీ కెమెరాల ఏర్పాటుకు ముందుకురావాలి. మిగిలిన గ్రామాల్లో దాతల సహకారంతో ఏర్పాటు చేసేందుకు కృషిచేస్తాం.

– నాగరాజు, ఎస్సై, వేములవాడ రూరల్

అనిల్ కుటుంబాన్ని ఆదుకోవాలి

- హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల


అనిల్ కటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఈటల


పరామర్శిస్తున్న ఆదిశ్రీనివాస్

బోయినపల్లి (చొప్పదండి): జమ్మూ కాశ్మీర్‌లో జరిగిన హెలికాప్టర్ ప్రమాదంలో అమరుడైన పబ్బాల అనిల్ కుటుంబాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ కోరారు. గురువారం మండలంలోని మల్కాపూర్‌లో అనిల్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సుమారు 11 ఏళ్లుగా అనిల్ సైనికుడిగా పని చేశాడన్నారు. రాష్ట్రంలో ఆర్మీ జవాన్ల కుటుంబాలను ప్రభుత్వ పరంగా ఆదుకుంటామని చెప్పిన సీఎం కేసీఆర్ ఇప్పటివరకు అనిల్ కుటుంబానికి ప్రభుత్వం సాయం ప్రకటించకపోవడం బాధాకరమన్నారు. అనిల్ భార్య సౌజన్యకు ప్రభుత్వ ఉద్యోగంతో పాటు ఇంటిస్థలం ఇవ్వాలన్నారు. అనంతరం అనిల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. మాజీ ఎమ్మెల్యే బొడిగ శోభ, మాజీ జెడ్పీ చైర్ పర్సన్ తుల ఉమ, పెరుక శ్రవణ్, మండల బీజేపీ అధ్యక్షుడు గుడి రవీందర్ రెడ్డి, ఎడపల్లి పర్శరాములు, ఉదారి నర్సింహాచారి, కొనుకటి హరీశ్, రామిడి శ్రీనివాస్, చెక్కబండి భూమిరెడ్డి తదితరులున్నారు.

ఆది శ్రీనివాస్ పరామర్శ

బోయినపల్లి(చొప్పదండి): హెలికాప్టర్ ప్రమాదంలో మృతిచెందిన మండలంలోని మల్కాపూర్ గ్రామానికి చెందిన పబ్బాల అనిల్ కుటుంబాన్ని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఆది శ్రీనివాస్ గురువారం పరామర్శించారు. యువ జవాన్ మృతి తీరని లోటు అని, ఆయన కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. ఆయన వెంట చందుర్తి జెడ్పీటీసీ నాగం కుమార్, పార్టీ మండల అధ్యక్షుడు వన్నెల రమణారెడ్డి, పులి లక్ష్మిపతి, ఏనుగుల కనుకయ్య, బాబు తదితరులు ఉన్నారు.

ఎనిమిది మందిపై కేసు

గంభీరావుపేట (సిరిసిల్ల): మండలంలోని గోరింటాల ఫారెస్టు బీట్ పరిధిలో చెట్లు నరికి, భూమి చదును చేసిన ఎనిమిది మందిపై కేసు నమోదైనట్లు ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ రమేశ్ తెలిపారు. గోరింటాల అటవీ పరిధిలో రాజేశ్వర్‌రావు నగర్ గ్రామానికి చెందిన వారు ఇటీవల దాదాపు రెండెకరాల పరిధిలో చెట్లు నరికివేసినట్లు ఆయన తెలిపారు.

పెళ్లికి ముందురోజు పరీక్షకు హాజరు


పద్మావతి

కోరుట్ల: పెళ్లికి ఒక్క రోజు ముందు బయటకు వెళ్లడం కష్టమైనప్పటికీ చదువుకోవాలన్న పట్టుదల ఆ అమ్మాయిని పరీక్ష హాల్‌కు నడిపించింది. పెళ్లి కొడుకు సహకారం అందించాడు. పట్టణంలోని అల్లమయ్యగుట్ట చింతవాడకు చెందిన ఈర్నాల పద్మావతి కోరుట్లలో బీఎస్సీ (బీజడ్‌సీ) సెకండియర్ చదువుతోంది. హైదరాబాద్‌కు చెందిన వ్యక్తితో శుక్రవారం మధ్యాహ్నం వివాహం జరగనుంది. మూడు రోజుల ముందుగానే పెళ్లి కూతుర్ని చేయడం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. గురువారం పరీక్షకు హాజరైంది. శుక్రవారం కూడా మరో పరీక్ష ఉందని, పెళ్లి కార్యక్రమం ముగియగానే భర్తతో వెళ్లి పరీక్ష రాస్తానని పద్మావతి తెలిపింది.

దొంగను పట్టుకున్న స్థానికులు

జగిత్యాల క్రైం : జిల్లా కేంద్రంలోని పాత బస్టాండ్‌లో ప్రయాణికుడి నుంచి పర్సు చోరీ చేసిన దొంగను స్థానికులు పట్టుకొని పోలీసులకు అప్పగించారు. మంచిర్యాల జిల్లా జన్నారం మండలం చింతగూడ గ్రామానికి చెందిన భూక్య నర్సింగ్ జిల్లా కేంద్రంలోని ఓ వ్యక్తి వద్ద పనిచేస్తున్నాడు. గురువారం యజమాని వద్ద రూ.5 వేలు తీసుకుని ఇంటికి వెళ్తుండగా పాతబస్టాండ్‌లో బస్సు ఎక్కుతున్న సమయంలో రామడుగు మండల కేంద్రానికి చెందిన గణేశ్ అలియాస్ రాము అనే వ్యక్తి జేబులోంచి పర్సు కొట్టేశాడు. అందులోంచి రూ.5 వేలు వెంట వచ్చిన మరో వ్యక్తికి ఇచ్చాడు. ఇతన్ని పట్టుకునే లోపే మరో వ్యక్తి పరారయ్యాడు. దీంతో జేబుదొంగను పోలీసులకు అప్పగించారు.

13న ఓపెన్ ఇంటర్ పరీక్ష

జగిత్యాల: జిల్లాలో ఓపెన్ ఇంటర్ పబ్లిక్ పరీక్షలు ఏప్రిల్ 25 నుంచి మే 4 వరకు నిర్వహించడం జరిగిందని, మే 2న అర్థికశాస్త్రం ఎకానమిక్స్ తెలుగు మీడియం పరీక్ష రద్దు కాగా, ఈనెల 13న నిర్వహించనున్నట్లు డీఈవో జగన్మోహన్‌రెడ్డి తెలిపారు. ఇప్పటి వరకు పరీక్షలు జరిగిన కేంద్రాల్లోనే అర్థికశాస్త్రం పరీక్ష నిర్వహించడం జరుగుతుందని, అభ్యసన కేంద్రాల ఆల్ కో ఆర్డినేటర్లు విధిగా హాజరు కావాలన్నారు. ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు 12 నుంచి 19 వరకు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందన్నారు.

మహిళ అదృశ్యం

జగిత్యాల క్రైం: జగిత్యాల రూరల్ మండలం బాలపల్లికి చెందిన మారంపల్లి నర్సవ్వ (52) అదృశ్యమైనట్లు పోలీసులు కేసు నమోదు చేశారు. బాలపల్లికి చెందిన నర్సవ్వ ఈనెల 9న రాత్రి భోజనం చేసి పడుకుంది. వేకువ జామున కనిపించకపోవడంతో బంధువులు, స్నేహితుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభించ లేదు. ఆమె కుమారుడు మారంపల్లి రాజేందర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై శంకరయ్య తెలిపారు.

గల్ఫ్ మోసాలకు పాల్పడితే పీడీయాక్టు


మాట్లాడుతున్న ఎస్పీ అఖిల్ మహాజన్

- ఎస్పీ అఖిల్ మహాజన్


సిరిసిల్ల క్రైం : గల్ఫ్ ఏజెంట్లు మోసాలకు పాల్పడితే పీడీయాక్టు నమోదు చేస్తామని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. సిరిసిల్ల టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఏజెంట్లతో పాటు, నకిలీ ఏజెంట్లుగా చలామణి అవుతున్న వారితో సమావేశం నిర్వహించారు. ఎవరైన గల్ఫ్‌కు వెళ్లాలనుకుంటే వీసాపై సందేహాలను నివృత్తి చేసేందుకు 8712656411లో స్పెషల్ బ్రాంచీ సీఐ స్థాయి అధికారిని సంప్రదించాలన్నారు. జిల్లాలో నకిలీ ఏజెంట్ల నియంత్రణ చర్యలో భాగంగా 14 మంది అరెస్ట్ చేసినట్లు తెలిపారు. సమావేశంలో డీఎస్పీ నాగేంద్రచారి, రవికుమార్, సీఐలు కరుణాకర్, ఉపేందర్, అనిల్‌కుమార్, ఏజెన్సీల సభ్యులు పాల్గొన్నారు.

పోలీస్ అధికారులపై విమర్శలు..

గల్ఫ్ ఏజెంట్ల సమావేశానికి వ్యక్తులుండాలన్న విధానాన్ని పోలీసు అధికారులు పాటించారన్న విమర్శలు వస్తున్నాయి. ఉన్నతాధికారి సమావేశానికి పిలిచిన వారిలో ఎంతోమంది గతంలో వివిధస్థాయిల్లో కేసులు నమోదైన వారు ఉన్నప్పటికీ చాలామంది ఈ పనులు చేయడం లేదని వాపోతూ ఉన్నతాధికారి సమావేశానికి రమ్మన్నారని పోలీసులు చెబితే వచ్చినట్లు తెలిపారు. కొందరు 'సాక్షి'తో మాట్లాడుతూ.. ఎప్పుడో ఏజెంట్‌గా పనిచేసిన వారిని పిలిచి తాము మర్చిన విధానాలను గుర్తు చేసినట్లు వాపోయారు. ఎక్కడ గల్ఫ్‌పేరిట మోసం జరిగినా తనిఖీలు చేస్తున్నారని వాపోయారు. మోసాలకు పాల్పడితే కేసు నమోదు చేసి, చర్యలు తీసుకున్నా కట్టుబడి ఉంటామని చెప్పడం గమనార్హం.

'మాతాశిశు'లో శిశువు మృతి

- వైద్యుల నిర్లక్ష్యంతోనేనంటూ బంధువుల ఆందోళన


ఆందోళన చేస్తున్న బంధువులు

జగిత్యాల : జిల్లా కేంద్రంలోని మాతా శిశు ఆరోగ్య కేంద్రంలో శిశువు మృతిచెందగా వైద్యుల నిర్లక్ష్యతోనేనంటూ బంధువులు ఆందోళన చేపట్టారు. వివరాల్లోకి వెళితే.. గంగాధర మండలం మల్లాపూర్‌కు చెందిన శేఖర్ తన భార్య జమునను డెలివరీ కోసం బుధవారం మాతా శిశు కేంద్రంలో చేర్పించాడు. సిజేరియన్ చేస్తే ఇబ్బందులవుతాయని వైద్యులు నార్మల్ డెలివరీ కోసం చూశారు. బీపీ పెరగడంతో శిశువు మృతిచెందింది. కాగా వైద్యుల నిర్లక్ష్యతోనే శిశువు మృతిచెందినట్లు ఆస్పత్రి ఎదుట ఆందోళన చేశారు. సూపరింటెండెంట్ రాములు మాట్లాడుతూ.. డెలివరికి సమయం ఉంది. ఈలోపే బీపీ పెరగడంతో శిశువు మృతిచెందిందని, వైద్యుల నిర్లక్ష్యం లేదని తెలిపారు.

బీజేపీ నాయకుల మద్దతు..

ఆస్పత్రి ఎదుట బంధువులు ఆందోళన చేపట్టగా వారికి బీజేపీ నాయకులు మద్దతు తెలిపారు. పోలీసు ఆస్పత్రికి చేరుకొని ఆందోళనను విరమింపజేశారు. ఫిర్యాదు చేస్తే విచారణ చేపడతామన్నారు. బీజేపీ నాయకులు పన్నాల తిరుపతి రెడ్డి, మదన్‌మోహన్, దీటి వెంకటేశ్, సామల సతీశ్, మోహన్‌రెడ్డి, సతీశ్‌రెడ్డి పాల్గొన్నారు.

పదోతరగతి ఫలితాల్లో 'ట్రినిటీ' సత్తా


విజయసంకేతం చూపుతున్న చైర్మన్ ప్రశాంత్‌రెడ్డి, విద్యార్థులు

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లిలోని ట్రినిటీ పాఠశాల విద్యార్థులు పదోతరగతి ఫలితాల్లో వందశాతం ఉత్తీర్ణతతో సత్తా చాటారు. రిషి, శశికాంత్, సూర్య తేజ, విజయ్‌కుమార్, అశ్విత, హరిణి, హిమాని, మల్లిక, మనస్విని, నాగజ్యోతిక, సహస్ర, సాయి, అక్షయ్, సాయిహర్షిణి, సంజన తదితర 32 మంది విద్యార్థులు 10 జీపీఏ సాధించారని విద్యాసంస్థల చైర్మన్ దాసరి ప్రశాంత్‌రెడ్డి తెలిపారు. 33 మంది 9.8 జీపీఏ, 46 మంది 9.7, 33 మంది 9.5, 40 మంది 9.3, 38 మంది 9.2, 23 మంది 9 జీపీఏ సాధించారన్నారు. అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను గురువారం ఆయన అభినందించారు. ఉపాధ్యాయుల ఉత్తమ బోధనతో ఏటా రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధిస్తున్నామని పేర్కొన్నారు. ప్రిన్సిపాల్ రమేశ్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

'సిద్ధార్థ' విద్యార్థుల విజయకేతనం


అత్యధిక గ్రేడ్ పాయింట్లు సాధించిన విద్యార్థులతో డైరెక్టర్ శ్రీపాల్‌రెడ్డి

సప్తగిరికాలనీ(కరీంనగర్): పదోతరగతి ఫలితాల్లో కరీంనగర్‌లోని సిద్ధార్థ విద్యాసంస్థలకు చెందిన విద్యార్థులు విజయకేతనం ఎగురవేశారు. అత్యుత్తమ జీపీఏ గ్రేడ్ పాయింట్లు సాధించినట్లు విద్యాసంస్థల డైరెక్టర్ దాసరి శ్రీపాల్ రెడ్డి తెలిపారు. 11 మంది 10 జీపీఏ, 14 మంది 9.8 జీపీఏ, 21 మంది 9.7 జీపీఏ, 125 మంది 9.0, ఆపైన జీపీఏ సాధించినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా గురువారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థులను ఆయనతోపాటు ప్రిన్సిపాళ్లు, వైస్ ప్రిన్సిపాళ్లు, ఉపాధ్యాయులు అభినందించారు. తమ విద్యాసంస్థల నుంచి మొత్తం 238 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవగా 99 శాతం మంది ఉత్తీర్ణులయ్యారని తెలిపారు.

రాష్ట్రస్థాయి జిజ్ఞాసలో విద్యార్థుల ప్రతిభ


ప్రశంసాపత్రాలు అందుకుంటున్న విద్యార్థులు

వేములవాడ అర్బన్ : వేములవాడ మండలంలోని అగ్రహారం ప్రభుత్వ డిగ్రీ కళాశాల కామర్స్ విభాగం విద్యార్థుల ప్రాజెక్ట్ రాష్ట్రస్థాయి జిజ్ఞాసలో ప్రథమ బహుమతి సాధించిందని కళాశాల ప్రిన్సిపాల్ వడ్లూరి శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కామర్స్ సహాయ ఆచార్యులు మల్లారెడ్డి పర్యవేక్షణలో విద్యార్థులు సుష్మ, లహరిక, రాజేశ్, యశ్వంత్, అనిరుద్ డిజిటల్ చెల్లింపులపై సిరిసిల్ల పట్టణంలోని వీధి వ్యాపారులకు అవగాహన, వారు ఉపయోగిస్తున్న డిజిటల్ వాలెట్లు, ఎదుర్కొంటున్న సమస్యలపై పరిష్కార మార్గాలను ప్రాజెక్ట్ ద్వారా నివేదించారు. ప్రాజెక్ట్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికై ఇటీవల హైదరాబాద్‌లో ఇందిరా ప్రియదర్శిని మహిళా డిగ్రీ కళాశాల నాంపల్లిలో విద్యార్థులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సమర్పించారు. రాష్ట్రస్థాయిలో ఎంపికైన 23 కామర్స్ ప్రాజెక్ట్‌ల్లో అగ్రహారం డిగ్రీ కళాశాల విద్యార్థుల ప్రాజెక్ట్ ప్రథమ స్థానం సాధించినట్లు తెలిపారు. ఈనెల 16న హైదరాబాద్‌లోని పొట్టి శ్రీ రాములు తెలుగు యూనివర్సిటీలో బహుమతులు అందజేయనున్నారు. రాష్ట్రస్థాయిలో ప్రథమ బహుమతి సాధించిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందించారు. విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్, అధ్యాపకులు అభినందించారు.

హిందూ ఏక్తాయాత్రకు తరలిరావాలి

- బీజేపీ జిల్లా ఇన్‌చార్జి మోహన్‌రెడ్డి


మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

ఎల్లారెడ్డిపేట (సిరిసిల్ల): హిందువులు ఐక్యతను చాటుతూ ప్రతీ గ్రామం నుంచి హిందూ ఏక్తాయాత్రకు జిల్లా నుంచి పెద్ద ఎత్తున తరలిరావాలని బీజేపీ జిల్లా ఇన్‌చార్జి గంగాడి మోహన్ రెడ్డి కోరారు. మండలకేంద్రంలో ఏక్తాయాత్ర సన్నాహక సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కరీంనగర్‌లో నిర్వహించే ఏక్తాయాత్రకు పెద్దఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డబోయిన గోపి, జిల్లా ఉపాధ్యక్షుడు గుండాడి వెంకట్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి మద్దుల బుగ్గారెడ్డి, మండలాధ్యక్షుడు పొన్నాల తిరుపతిరెడ్డి, నాయకులు లక్ష్మారెడ్డి, దేవేందర్ రెడ్డి, కిరణ్, గణేశ్, స్వామి, శ్రీకాంత్, యాదగిరి, సత్యంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


చంద్రశేఖర్ (ఫైల్)

సిరిసిల్లఅర్బన్: కామారెడ్డి జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో సిరిసిల్ల పట్టణం శాంతినగర్‌కు చెందిన వ్యక్తి మృతిచెందాడు. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శాంతినగర్‌కు చెందిన గోగికార్ చంద్రశేఖర్ (32) మటన్ దుకాణం నిర్వహిస్త జీవనం సాగిస్తున్నాడు. గురువారం పనినిమిత్తం ద్విచక్రవాహనంపై కామారెడ్డికి వెళ్లాడు. సిరిసిల్లకు తిరిగి వస్తున్న క్రమంలో పెద్దమ్మ జంగల్ ఘన్‌పూర్ శివారు వద్ద ఏపీ 28 వై 2873 అనే నెంబర్ గల టిప్పర్ చంద్రశేఖర్ ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో చంద్రశేఖర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు కామారెడ్డిలోని ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు. మృతుడి సోదరుడు రాజేశ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని మరొకరు..


రాజిరెడ్డి అలియాస్ కిట్టు (ఫైల్)

తంగళ్లపల్లి: మండలంలోని సారంపల్లి ప్రధాన రహదారిపై గురువారం రాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దేశాయిపల్లికి చెందిన గట్టు రాజిరెడ్డి అలియాస్ కిట్టు (35) ద్విచక్రవాహనంపై వెళ్తుండగా సారంపల్లి ప్రధాన రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో రాజిరెడ్డి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య ఉమ, ఇద్దరు కూతుళ్ల కృతిక (11) సాత్విక (8) ఉన్నారు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు ఘటనాస్థలానికి చేరుకొని కన్నీరు మున్నీరయ్యారు. పోలీసులు మృతదేహాన్ని సిరిసిల్ల ఏరియా ఆస్పత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చెరువులో పడి వృద్ధుడు..


చెరువులో మల్లయ్య మృతదేహం

ముస్తాబాద్ : మండలకేంద్రానికి చెందిన ఏదునూరి మల్లయ్య (75) గ్రామ శివారులోని పెద్ద చెరువు నీటిలో మునిగి గురువారం మృతిచెందాడు. పెద్ద చెరువు వద్ద ఉన్న పొలం వద్దకు వెళ్లగా చెరువులో మునిగి మృతిచెందాడు. కాగా చెరువులో చేపలవేట కోసం ఎవరైనా విద్యుత్ తీగలు అమర్చారా.. గుండె పోటుతో మృతిచెందాడా అనేది తెలియాల్సి ఉందని పోలీసులు తెలిపారు. మృతుడికి భార్య ముత్తవ్వ, ఇద్దరు కుమారుల ఉన్నారు. ఘటనా స్థలాన్ని ఏఎస్‌ఐ వెంకటరమణ పరిశీలించి విచారణ చేపట్టారు.